సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

శనివారం । 9 । డిసెంబర్ । 2023



'నోటా'కు తగ్గుదల..

ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో ఈసారి 'నోటా'కు ఓటేసిన వారి సంఖ్య తగ్గింది. 8లో



విడిగానా.. కలిసేనా!?

సింగరేణి 'గుర్తింపు' ఎన్నికల్లో కూడా సీపీఐ, కాంగ్రెస్ జత కలుస్తాయనే విషయమై ఇంకా స్పష్టత లేదు. 10లో

గరిష్టం / కనిష్టం
29° / 19°

వాతావరణం

జిల్లాలో శనివారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉంది. రాత్రి వేళ వాతావరణం చల్లబడుతుంది.

న్యూస్‌రీల్

స్వర్ణకవచాలతో రామయ్య దర్శనం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: శ్రీసీతారామచంద్ర స్వామివారి దేవస్థానం అంతరాలయంలోని మూలమూర్తులు శుక్రవారం స్వర్ణ కవచధారులై భక్తులకు దర్శనమిచ్చారు. తొలుత తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీతధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా జరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

30న జాతీయ లోక్ అదాలత్

నవభారత్: ఈ నెల 30న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.భానుమతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజీపడదగిన క్రిమినల్ కేసులు, సివిల్ కేసులు, చెక్ బౌన్స్, మనోవర్తి కుటుంబ తగాదాలు, మోటారు వాహన ప్రమాద కేసులు, ఇ–పెట్టీ చలాన్, డ్రంక్ అండ్ డ్రైవ్, బ్యాంకు టెలిఫోన్ ప్రిలిటికేషన్ కేసులను రాజీమార్గం ద్వారా పరిష్కరించుకోవచ్చని పేర్కొన్నారు.

దివ్యాంగులు అవార్డులకు దరఖాస్తు చేసుకోవాలి

నవభారత్: అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సదర్భంగా రాష్ట్రీయ దివ్యాగుల సాధికారత రాష్ట్రస్థాయి అవార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సంక్షేమ శాఖ అధికారి డాక్టర్ వేల్పుల విజేత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దివ్యాంగులు ఉత్తమ ఉద్యోగి, ఉత్తమ వ్యక్తిగత సామాజిక కార్యకర్త, ఉత్తమ క్రీడకారుడు, ఉత్తమ సంస్థ, ఉత్తమ యజమాని, ఉత్తమ దివ్యాంగ సాంస్కృతిక కార్యక్రమం విభాగాల్లో అవార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ నెల 10లోగా ఆన్‌లైన్‌లో www. wdsc. telangana. gov. in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఇతర వివరాలకు 83310 06010 నంబరులో సంప్రదించాలని పేర్కొన్నారు.

అధ్యక్షా...!

తెలంగాణ రాష్ట్ర మూడో అసెంబ్లీకి ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి ఎన్నికైన శాసనసభ్యులు శనివారం ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఇందులో కాంగ్రెస్ నుంచి ఎనిమిది మంది, సీపీఐ, బీఆర్ఎస్ నుంచి ఒక్కొక్కరు ఉన్నారు. తొలి అసెంబ్లీ సమావేశాల్లో పాల్గొనేందుకు ఇప్పటికే వీరంతా హైదరాబాద్ చేరుకున్నారు. ప్రొటెం స్పీకర్‌గా అక్బరుద్దీన్ ఒవైసీని ఎంపిక చేసిన నేపథ్యాన, ఆయన ఎమ్మెల్యేలతో ప్రమాణ స్వీకారం చేయించనున్నారు. – సాక్షిప్రతినిధి, ఖమ్మం



నేడు ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకారం

- ప్రక్రియ చేపట్టనున్న ప్రొటెం స్పీకర్
- ఇప్పటికే మంత్రులుగా ముగ్గురి ప్రమాణం పూర్తి
- తొలిసారి అసెంబ్లీలో అడుగిడుతున్న ఐదుగురు

కాంగ్రెస్‌దే మెజార్టీ..

తెలంగాణ ఏర్పడ్డాక మూడో సారి అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. గత నెల 30న ఎన్నికలు జరగ్గా, ఫలితాలు ఈనెల 3వ తేదీన వెల్లడయ్యాయి. ఈమేరకు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కాంగ్రెస్ పార్టీ మెజార్టీ స్థానాలను దక్కించుకుంది. మధిర నుంచి మల్లు భట్టి విక్రమార్క, పాలేరు నుంచి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఖమ్మం నుంచి తుమ్మల నాగేశ్వరరావు, సత్తుపల్లి నుంచి మట్టా రాగమయి, వైరా నుంచి మాలోతు రాందాస్‌నాయక్, పినపాక నుంచి పాయం వెంకటేశ్వర్లు, ఇల్లెందు నుంచి కోరం కనకయ్య, అశ్వారావుపేట నుంచి జారె ఆదినారాయణ విజయం సాధించారు. ఇక కాంగ్రెస్ మిత్రపక్షమైన సీపీఐ అభ్యర్థి కూనంనేని సాంబశివరావు కొత్తగూడెం స్థానం నుంచి ఎన్నికయ్యారు. భద్రాచలం నుంచి మాత్రమే బీఆర్ఎస్ అభ్యర్థి తెల్లం వెంకట్రావు గెలుపొందారు. వీరిలో భట్టి డిప్యూటీ సీఎంగా, పొంగులేటి, తుమ్మల మంత్రులుగా ఇప్పటికే ప్రమాణ స్వీకారం చేశారు. ఇక శనివారం మిగతా వారితో ప్రొటెం స్పీకర్ ప్రమాణ స్వీకారం చేయించనున్నారు.

గత ఎన్నికల్లోనూ గెలిచినా..

గత అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఉమ్మడి ఖమ్మం జిల్లా ఓటర్లు కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టారు. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ.. టీడీపీ, సీపీఐ, ఇతర పార్టీలతో కలిసి పోటీ చేసింది. అప్పుడు కాంగ్రెస్ పార్టీ తరఫున మధిర నుంచి మల్లు భట్టివిక్రమార్క, పాలేరు నుంచి కందాళ ఉపేందర్‌రెడ్డి, కొత్తగూడెం నుంచి వనమా వెంకటేశ్వరరావు, భద్రాచలం నుంచి పొదెం వీరయ్య, పినపాక నుంచి రేగా కాంతారావు, ఇల్లెందు నుంచి హరిప్రియ గెలవగా.. మిత్రపక్షమైన టీడీపీ నుంచి సత్తుపల్లిలో సండ్ర వెంకటవీరయ్య, అశ్వారావుపేట నుంచి మెచ్చా నాగేశ్వరరావు విజయం సాధించారు. వైరాలో స్వతంత్ర అభ్యర్థి లావుడ్యా రాములునాయక్, ఖమ్మంలో బీఆర్ఎస్ అభ్యర్థి పువ్వాడ అజయ్‌కుమార్ గెలిచారు. కానీ ఎన్నికల అనంతరం పరిణామాలతో కందాళ ఉపేందర్‌రెడ్డి, వనమా వెంకటేశ్వరరావు, రేగా కాంతారావు, హరిప్రియ, సండ్ర వెంకటవీరయ్య, మెచ్చా నాగేశ్వరరావు, లావుడ్యా రాములునాయక్ బీఆర్ఎస్‌లో చేరారు. దీంతో బీఆర్ఎస్ బలం ఎనిమిదికి చేరగా... కాంగ్రెస్‌కు భట్టి, వీరయ్య మాత్రమే మిగిలారు.

'హస్తం'లో నయా జోష్

గత పదేళ్లుగా నైరాశ్యంలో ఉన్న కాంగ్రెస్‌కు ఈ ఎన్నికలు నూతన ఉత్సాహాన్ని తీసుకొచ్చాయి. ఉమ్మడి జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలంగా ఉన్నప్పటికీ.. గత రెండు దఫాలు రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడడం,, కాంగ్రెస్ నుంచి ఎన్నికైన శాసనసభ్యులు బీఆర్ఎస్‌లో చేరడంతో కేడర్ నిరుత్సాహానికి గురైంది. చుక్కాని లేని నావలా గత పదేళ్లు నడిచింది. అయితే, ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, ద్వితీయ శ్రేణి నాయకులు అహర్నిశలు కృషి చేయడంతో ఎనిమిది స్థానాలతో పాటు మిత్రపక్షంగా సీపీఐ ఓ స్థానాన్ని దక్కించుకుంది. రాష్ట్రంలో పార్టీ అధికారంలోకి రావడానికి ఉమ్మడి ఖమ్మం కీలకంగా నిలిచిన నేపథ్యాన భట్టికి డిప్యూటీ సీఎం పదవితో పాటు పొంగులేటి, తుమ్మలకు మంత్రి పదవులు దక్కాయి. ఈసందర్భంగా ఎన్నికల ఫలితాలు వెలువడిన రోజునే బాణసంచా కాల్చి సంబురాలు చేసుకున్న పార్టీ శ్రేణులు... మంత్రులుగా ప్రమాణ స్వీకారం రోజు సంబురాలు మరింత ఘనంగా జరుపుకున్నారు.

ఈ ఐదుగురు తొలిసారి

ఉమ్మడి జిల్లా నుంచి ఎన్నికైన పది మంది ఎమ్మెల్యేల్లో ఐదుగురు తొలిసారిగా శాసనసభలోకి అడుగుపెడుతున్నారు. వీరిలో పొంగులేటి శ్రీనివాసరెడ్డి, మట్టా రాగమయి, మాళోతు రాందాస్‌నాయక్, తెల్లం వెంకట్రావు, జారె ఆదినారాయణ మొదటి సారి అసెంబ్లీకి ఎన్నికయ్యారు. అయితే, పొంగులేటి శ్రీనివాసరెడ్డికి గతంలో ఎంపీగా పనిచేసిన అనుభవం ఉండగా.. మిగిలిన నలుగురు చట్టసభకు ఎన్నిక అవడం ఇదే ప్రథమం. ప్రజా సమస్యల పరిష్కారం, నియోజకవర్గ అభివృద్ధి కోసం ఇది తమకు దక్కిన మంచి అవకాశమని శాసనసభ్యులు భావిస్తున్నారు.

మళ్లీ వస్తాం..!

- అంతర్మథనంలో పార్టీ మారిన సీపీఐ కౌన్సిలర్లు
- గత నెలలో బీఆర్ఎస్‌లో చేరిన ఐదుగురు
- ఎన్నికల తర్వాత కొత్తగూడెంలో మారిన పరిస్థితులు
- రీఎంట్రీపై ఎటూ తేల్చని పార్టీ నాయకత్వం

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: అసెంబ్లీ ఎన్నికల తర్వాత జిల్లాలో రాజకీయ పరిస్థితులు వేగంగా మారిపోతున్నాయి. నిన్నా మొన్నటి వరకు ప్రతిపక్ష పార్టీలను వీడి అధికార పార్టీలోకి జంప్ అయిన నేతలు తిరిగి సొంత గూటికి వెళ్లేందుకు మార్గాలు వెతుక్కుంటున్నారు. మారుతున్న రాజకీయ సమీకరణాలకు తొలి వేదికగా జిల్లా కేంద్రమైన కొత్తగూడెం నిలుస్తోంది.

సీపీఐని వీడి బీఆర్ఎస్‌లోకి..

ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కొత్తగూడెం నుంచి ఎలాగైనా పోటీ చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు పట్టుబట్టారు. అనుకున్నట్టుగానే బీఆర్ఎస్‌తో పొత్తు చెడినా ఓపికగా కాంగ్రెస్‌తో జత కట్టి సీటు సాధించారు. ఈ క్రమంలో కొత్తగూడెం సీటు నుంచి రాష్ట్ర కార్యదర్శి హోదాలో ఉన్న కూనంనేని పోటీ చేయడం సరికాదని, కూనంనేని బదులు బీసీలకు లేదా ఆ పార్టీ జిల్లా కార్యదర్శిగా ఉన్న సాబీర్ పాషాకు టికెట్ ఇవ్వాలనే డిమాండ్ తెర మీదకు వచ్చింది. సీపీఐకి కొత్తగూడెం మున్సిపాలిటీలో మొత్తం ఎనిమిది మంది కౌన్సిలర్లు ఉండగా, సాబీర్ పాషాకు టికెట్ ఇవ్వాలని ఐదుగురు కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. అయితే వీరి డిమాండ్‌ను పార్టీ పెద్దలు పరిగణనలోకి తీసుకోలేదు. దీంతో ఐదుగురు కౌన్సిలర్లు నవంబరు రెండో వారంలో సీపీఐని వీడి గులాబీ కండువా కప్పుకున్నారు.

అంచనాలు తారుమారు

అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల ఘట్టం పూర్తయ్యే సమయానికి సీపీఐ అభ్యర్థి కూనంనేనికి గెలుపు అవకాశాలు తక్కువగానే కనిపించాయి. కానీ ఆ తర్వాత పొంగులేటి శ్రీనివాసరెడ్డి దిశానిర్దేశం, కాంగ్రెస్ అగ్రనేతల ప్రచారం, సీపీఐ కేడర్ సమన్వయంతో పోలింగ్‌కు చివరి వారం రోజుల్లో పరిస్థితులు వేగంగా మారిపోయాయి. తక్కువ అంచనాల మధ్య బరిలో నిలిచిన కూనంనేని అనూహ్యంగా విజయం సాధించగా గెలుపు తథ్యం అనుకున్న బీఆర్ఎస్ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు మూడో స్థానంలో నిలిచారు. ఎన్నికల సమయంలో కొత్తగూడెంలో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర కీలకంగా వ్యవహరించారు. సీపీఐ కౌన్సిలర్లు గులాబీ తీర్థం పుచ్చుకోవడంలో ఆయనదే ప్రధాన పాత్ర. కానీ ఫలితాల తర్వాత పరిస్థితులు మారాయి. వద్దిరాజు గూడెం వైపు కన్నెత్తి చూడకపోవడంతోపాటు నియోజకవర్గంలో పార్టీ పెద్దగా ఉన్న వనమా ఇంటి గడప దాటడం లేదు.

సొంతగూటికి ప్రయత్నాలు

ఎన్నికల ఫలితాల తర్వాత బీఆర్ఎస్ పార్టీలో పరిస్థితులు ఆశాజనకంగా లేకపోవడంతో ఆ పార్టీలో ఇటీవల చేరిన ఐదుగురు కౌన్సిలర్లు తిరిగి సొంత గూటికి వెళ్లే ప్రయత్నంలో ఉన్నట్టు సమాచారం. ఈ మేరకు సీపీఐ అధినాయకత్వంతో మధ్యవర్తుల ద్వారా వర్తమానం పంపినట్టు తెలుస్తోంది. అయితే ఎమ్మెల్యేగా గెలిచిన కూనంనేని సాంబశివరావు ఇంకా ప్రమాణ స్వీకారం చేయలేదు. అసెంబ్లీలో ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర కార్యదర్శి హోదాలో కూనంనేనితో చర్చించిన తర్వాతే ఈ అంశంపై స్పష్టత ఇస్తామని సీపీఐ నేతలు మధ్యవర్తులకు తెలిపినట్టు వార్తలు వస్తున్నాయి. అయితే ఈ అంశంపై ఇటు పార్టీ మారిన కౌన్సిలర్లు, అటు సీపీఐ నేతలు ఎవరూ బహిరంగ ప్రకటనకు సిద్ధంగా లేరు.

కూనంనేని కొత్తగూడెం వచ్చాకే..

కొత్తగూడెం నుంచి పోటీ చేసే విషయంలో ఏడాదిపాటు కష్టపడి పొత్తులు ఓకే చేసుకుని టికెట్ సాధించిన సమయంలో సీపీఐ కౌన్సిలర్లు తిరుగుబాటు చేయడాన్ని క్షమించేది లేదంటూ సీపీఐలో ఓ వర్గం గట్టిగా వాదిస్తోంది. మరోవర్గం ఈ విషయాన్ని చిన్న సమస్యగా పరిగణిస్తోంది. తిరుగుబాటు మొదలైనప్పుడే కూనంనేని దీన్ని చిన్న ఘటనగానే చూశారు తప్పితే పెద్దగా పట్టించుకోలేదంటున్నారు. పైగా పార్టీ మారిన వారంత తన బిడ్డల లాంటి వారని, వాళ్లను తానే నాయకులుగా తయారు చేశానంటూ కూనంనేని చెప్పిన విషయాన్ని వారు గుర్తు చేస్తున్నారు. కూనంనేని కొత్తగూడెం వస్తేనే ఈ అంశంలో స్పష్టత వస్తుందని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు.

తెగ తాగేశారు!

- గత నెల ఖమ్మం జిల్లాలో రూ.72కోట్ల మద్యం అమ్మకాలు
- ఎన్నికల వేళ జోరుగా అమ్మకం



ఖమ్మంక్రైం: అసెంబ్లీ ఎన్నికల వేళ మద్యం అమ్మకాలు జోరుగా సాగాయి. గడిచిన నవంబర్‌లో ఏకంగా ఖమ్మం జిల్లాలో రూ.72కోట్ల విలువైన మద్యం అమ్మకాలు జరిగాయి. జిల్లాలో 122 వైన్స్‌తో పాటు బార్లు ఉండగా... గత ఏడాది నవంబర్‌లో రూ.64కోట్ల మద్యం అమ్ముడైంది. కానీ ఈ ఏడాది రూ.72కోట్ల విలువైన మద్యం అమ్మకాలు జరగగా.. అది కూడా 27వ తేదీ వరకే జరగడం విశేషం. ఆతర్వాత 28నుంచి 30వ తేదీ వరకు ఎన్నికల దృష్ట్యా వైన్స్, బార్లు మూసివేయించారు. ఇదిలా ఉండగా మొత్తం అమ్మకాల్లో సుమారు రూ.40కోట్ల విలువైన మద్యం నవంబర్ చివరి పది రోజుల్లోనే అమ్ముడైందని అధికారులు చెబుతున్నారు. పోలింగ్ సమీపించడం, రెండు రోజులు వైన్స్ మూతపడతాయనే ముందు జాగ్రత్తతో చాలా మంది ముందస్తుగా భారీ మొత్తంలో మద్యం కొనుగోలు చేశారని తెలుస్తోంది. ఏది ఏమైనా ఎన్నికల పుణ్యమా అని వైన్స్‌ల పాత లైసన్స్‌దారులు స్టాక్‌ను అంతా వదిలించుకున్నారు. కాగా, జిల్లావ్యాప్తంగా జరిగిన మద్యం అమ్మకాల్లో ఖమ్మం ఎక్సైజ్ స్టేషన్–1, 2 ముందు వరుసలో నిలిచాయి.

ధాన్యం 'ప్రైవేటు'కే..

- ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలపై అనాసక్తి
- నిబంధనల పేరిట రైతులకు ఇబ్బందులు
- సీజన్‌లో 4 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి అంచనా
- మూడోవంతు కూడా పూర్తికాని వరికోతలు



గోపాల్‌రావుపేటలోని ధాన్యం కొనుగోలు కేంద్రం

సూపర్‌బజార్(కొత్తగూడెం): వానాకాలం సీజన్‌లో ధాన్యం కొనుగోలుకు జిల్లావ్యాప్తంగా ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలకు స్పందన కరువైంది. సీజన్‌లో వరినాట్లు ఆలస్యం కావడంతో జిల్లాలో ఇంకా వరికోతలు పూర్తి కాలేదు. వరికోతలు పూర్తయిన ప్రాంతాల్లో కూడా అన్నదాతలు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల వైపు మొగ్గు చూపడంలేదు. ఇందుకు ప్రధాన కారణం కొనుగోళ్లలో విధించిన నిబంధనలేనని రైతులు పేర్కొంటున్నారు. ఆరుగాలం కష్టపడి పంట పండించిన, కేంద్రాలకు చేర్చాక తేమశాతం అడ్డంగా మారుతోంది. 17 శాతం కంటే ఎక్కువ ఉంటే నిబంధనల ప్రకారం కొనుగోళ్లు చేపట్టరు. అదే ప్రైవేట్ వ్యాపారులు అయితే పంటకోతలు జరిగే ప్రాంతానికి సైతం వెళ్లి కొనుగోలు చేస్తున్నారు. దీంతో అన్నదాతలు ప్రైవేట్ వైపు వ్యాపారులకే వరి ధాన్యం విక్రయిస్తున్నారు.

1,61,155 ఎకరాల్లో వరి సాగు

జిల్లాలో ఈ వానాకాలం సీజన్‌లో 1,61,155 ఎకరాల్లో వరిపంట సాగు చేయగా, 4 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని వ్యవసాయ శాఖ అంచనా చేసింది. ఇప్పటివరకు కేవలం 54 వేల ఎకరాల్లోనే కోతలు పూర్తయినట్లు అధికారులు పేర్కొంటున్నారు. ఈలోగా తుపాన్ వల్ల వర్షాలు రావడంతో కోతలు ఆగిపోయాయి. వరిపంటలు దెబ్బతిన్నాయి. సర్వే పూర్తయితే ఎంతపంట మిగిలి ఉందో పూర్తిస్థాయిలో అర్థం అవుతుంది. ఇప్పటివరకు అధికారిక గణాంకాల ప్రకారం 61 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం ప్రైవేట్ వ్యాపారులకు అమ్మకాలు జరిగినట్లు అంచనా. ఇంకా రైతాంగం వద్ద కల్లాల్లో 11వేల మెట్రిక్‌టన్నుల ధాన్యం ఉన్నట్లు తెలుస్తోంది. కురిసిన వర్షాలకు జిల్లాలో అనేక చోట్ల ఆరబెట్టిన ధాన్యం తడిసింది. ధాన్యానికి ఈ సీజన్‌లో ఎ గ్రేడ్‌కు రూ 2,203, సాధారణ రకానికి రూ.2,183గా నిర్ణయించారు. ప్రైవేట్ వ్యాపారుల మాత్రం రూ. 1,900 నుంచి రూ.2,800 వరకు చెల్లిస్తున్నారు. కొనుగోలు కేంద్రాల నిబంధనలు, రవాణా ఖర్చులు, అమ్మిన కొన్ని రోజుల తర్వాత డబ్బులు బ్యాంకు ఖాతాల్లో పడే వరకు ఎదురుచూడడం తదితర ఎలాంటి ఇబ్బందులు లేకుండా నేరుగా రైతులకు డబ్బులు చెల్లించి ధాన్యాన్ని తీసుకువెళ్తుండటంతో రైతులు కొనుగోలు కేంద్రాల వైపు ఆసక్తి చూపడంలేదు.

సామగ్రి పంపిణీ

జిల్లాలో ఏర్పాటు చేసిన 150 కొనుగోలు కేంద్రాలకు మెటీరియల్‌ను పంపిణీ చేశారు. ప్రతి కొనుగోలు కేంద్రానికి 20 టార్పాలిన్లు, రెండు మాయిశ్చర్ మిషన్లు, ఒకవేయింగ్ మిషన్‌ను పంపిణీ చేసినట్లు సంబంధిత అధికారులు తెలిపారు.

వరికోతలు ఇంకా పూర్తికాలేదు



జిల్లాలో వానాకాలం సీజన్‌లోని ధాన్యం కొనుగోళ్లకు 150 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశాం. ఇంకా జిల్లాలో వరికోతలు జరుగుతున్నాయి. అందుకే కొనుగోలు కేంద్రాలకు ధాన్యం ఎక్కువగా రావడం లేదు. దమ్మపేట ప్రాంతంలో 58 వేల టన్నులు మాత్రం వచ్చింది. కోతల తర్వాత కొనుగోళ్లు పెరిగే అవకాశం ఉంది.

–పి.రుక్మిణీదేవి, డీఎస్‌ఓ

అతివలకు ఉచిత ప్రయాణం

- నేటి మధ్యాహ్నం నుంచి ఆర్టీసీ బస్సుల్లో అమలు
- పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ సర్వీసుల్లో మాత్రమే అవకాశం
- బస్సు ఎక్కేటప్పుడు ఆధార్ కార్డు చూపిస్తే చాలు
- జిల్లాలో 5,36,871 మంది మహిళలకు ప్రయోజనం



బస్సు ఎక్కుతున్న ప్రయాణికులు

మంచపల్లి: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలు దిశగా కొత్త ప్రభుత్వం అడుగులు వేస్తోంది. శనివారం కాంగ్రెస్ అగ్రనేత సోనియాగాంధీ పుట్టిన రోజు సందర్భంగా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం(మహాలక్ష్మి పథకం), రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకం రూ.10 లక్షలకు పెంపు హామీలను అమలు చేయాలని గురువారం సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించింది. మహిళా మంత్రులతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శనివారం మధ్యాహ్నం ఈ పథకాన్ని లాంఛనంగా ప్రారంభించనున్నారు. ఆయా డిపోల పరిధిలో అధికారులకు పథకం అమలుకు ఏర్పాట్లు చేస్తున్నారు. పాటించాల్సిన నియమాలపై సిబ్బందికి సూచనలు చేశారు. కొత్తగూడెం బస్టాండ్‌లో ఈ కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రియాంక ఆల ప్రారంభించనున్నారు. కాగా త్వరలోనే మహిళలందరికీ మహాలక్ష్మి స్మార్ట్ కార్డులు ఇవ్వనున్నారు.

ఆదాయం కోల్పోనున్న డిపోలు

రాష్ట్ర ప్రభుత్వం అమల్లోకి తేనున్న మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం వల్ల ఆర్టీసీపై మరింత ఆర్థిక భారం పడనుంది. జిల్లాలో రోజూ సుమారు 50 వేల నుంచి 60 వేల మంది ప్రయాణికులు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తుంటారు. కొత్తగూడెం, భద్రాచలం, మణుగూరు, ఇల్లెందు బస్సు డిపోలకు రోజువారీగా రూ.40 లక్షల నుంచి రూ.44 లక్షల వరకు ఆదాయం సమకూరుతుంది. భద్రాచలం డిపోకు అత్యధికంగా రూ.18 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు ఆదాయం వస్తుంది. ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం వల్ల ఈ డిపోల పరిధిలో ఆదాయం చాలా వరకు పడిపోయే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. రోజుకు సుమారు రూ.8 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు ఆదాయం తగ్గే అవకాశం ఉందని పేర్కొంటున్నారు. మూడేళ్లుగా ఆర్టీసీలో అధికారులు చేపడుతున్న సంస్కరణలు సంస్థకు కొంతమేర లాభాలను తెచ్చి పెడుతున్నాయి. నష్టాల్లో ఉన్న డిపోలను అటు కార్గో సేవలు కొంతవరకు లాభాల బాట పట్టిస్తున్న విషయం తెలిసిందే.

మహిళలందరికీ..

వయసుతో సంబంధం లేకుండా బాలికలు, మహిళలు, ట్రాన్స్‌జెండర్లు రాష్ట్రవ్యాప్తంగా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ సర్వీసుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చు. ఆధార్ కార్డు లేదా మరే ఇతర గుర్తింపు కార్డునైనా కండక్టర్‌కు చూపించాల్సి ఉంటుంది. డీలక్స్, సూపర్‌లగ్జరీతోపాటు రాజధాని, గరుడ వంటి ఏసీ బస్సుల్లో ఈ వెసులుబాటు ఉండదు. అంతర్రాష్ట్ర సర్వీసుల్లో రాష్ట్ర సరిహద్దు వరకు ఈ సదుపాయాన్ని వినియోగించుకోవచ్చు. ఈ పథకం ద్వారా జిల్లాలో 5,36,871 మంది మహిళలకు లబ్ధి చేకూరుతుంది.

డిపో పేరు	మొత్తం బస్సులు	పల్లె వెలుగు	ఎక్స్‌ప్రెస్
కొత్తగూడెం	64	30	18
మణుగూరు	75	17	29
భద్రాచలం	104	20	40
ఇల్లెందు	17	09	04

ఉద్యోగులకు సూచనలు చేశాం



రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సదుపాయాన్ని శనివారం నుంచి అమలు చేయనుంది. ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం కొత్తగూడెంలో లాంఛనంగా ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేశాం. మహిళా ప్రయాణికుల పట్ల అవలంబించే పద్ధతులపై ఉద్యోగులకు అవగాహన కల్పించాం.

–బి.వెంకటేశ్వరరావు, కొత్తగూడెం డీఎం

సైనిక్ స్కూల్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

సూపర్‌బజార్(కొత్తగూడెం): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విజయనగరం జిల్లా కోరుకొండలోని సైనిక్ స్కూల్‌లో 6, 9వ తరగతుల్లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల సూచించారు. జనవరి 21న ప్రవేశపరీక్ష ఉంటుందని తెలిపారు. ఆరో తరగతిలో చేరేందుకు 31.03.2024 నాటికి 10–12 ఏళ్ల లోపు వయసు కలిగినవారు, 9వ తరగతిలో చేరేందుకు 31.03.2024 నాటికి 13–15 ఏళ్ల వయసు కలిగి ఎనిమిదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలని వివరించారు. జనరల్ విద్యార్థులు రూ.650, ఎస్సీ, ఎస్టీలైతే రూ.500 ఫీజు ఆన్‌లైన్ ద్వారా చెల్లించి ఈ నెల 16లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాల కోసం https:// exams. nta. ac. in/ AISSEE/ వెబ్‌సైట్‌లో పరిశీలించాలని కలెక్టర్ ప్రియాంక తెలిపారు.

మా నాన్న ఉద్యోగం ఇప్పించండి సార్..

ప్రజాదర్బార్‌లో విన్నవించిన గూడెం వాసి



రామకృష్ణ దరఖాస్తును పరిశీలిస్తున్న మంత్రి సీతక్క

కొత్తగూడెంరూరల్: జిల్లాకు చెందిన పల్నాటి రామకృష్ణ తన తండ్రి ఉదోగ్యం ఇప్పించాలని సీఎం రేవంత్‌రెడ్డిని వేడుకున్నారు. హైదరాబాద్‌లో శుక్రవారం నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ఆయన వినతిపత్రం అందజేశారు. కొత్తగూడెం విద్యానగర్ కాలనీకి చెందిన దివ్యాంగుడు రామకృష్ణ తండ్రి పల్నాటి నాగేశ్వరరావు పంచాయతీరాజ్ శాఖలో 1980 నుంచి 2007వరకు అటెండర్(ఎన్‌ఎంఆర్)గా పనిచేశాడు. 2007 మే నేలలో ఆయన మృతి చెందగా, వారసుడైన రామకృష్ణకు ఉద్యోగం ఇవ్వాల్సి ఉంది. కానీ అలా జరగకపోవడంతో ట్రిబ్యునల్ కోర్టును ఆశ్రయించగా నాలుగు వారాల్లోగా ఉద్యోగం ఇవ్వాలని 2013లో ఆదేశాలు జారీ అయినా పట్టించుకోకపోవడంతో 2020లో హైకోర్టును ఆశ్రయించాడు. అయినా ఫలితం లేకపోవడంతో ప్రజాదర్బార్‌లో సీఎం రేవంత్‌కు రామకృష్ణ విన్నవించారు. దీంతో ఆయన పక్కనే మంత్రి సీతక్కను సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. ఈమేరకు దరఖాస్తు స్వీకరించిన సీతక్క సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

గిరిజన విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

భద్రాచలం ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్

భద్రాచలంటౌన్: ఏజెన్సీలోని గిరిజన విద్యార్థులు చదువులతో పాటు క్రీడల్లో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని భద్రాచల ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్ పేర్కొన్నారు. గత నెల 28 నుంచి ఈ నెల డిసెంబర్ 5 వరకు బెంగళూరులో జరిగిన జాతీయ స్థాయి సబ్ జూనియర్ బ్యాడ్మింటన్ పోటీల్లో చీపురుగూడెం గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థి కుర్సం మోహన్‌కృష్ణ ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకం కైవసం చేసుకున్నాడు. శుక్రవారం పీఓ తన చాంబర్‌లో విజేతను అభినందించారు. కార్యక్రమంలో డీడీ మరియమ్మ, ఏపీఓ డేవిడ్ రాజ్, క్రీడల అధికారి బొల్లి గోపాలరావు, పీడీఏఎస్ఓ వెంకటనారాయణ, విద్యార్థి తండ్రి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత ఆన్‌లైన్ శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

ఇల్లెందు: ఐటీడీఏ ఆధ్వర్యంలో గిరిజన నిరుద్యోగులకు కేంద్ర ప్రభుత్వం ఆధీనంలోని జీడీ కానిస్టేబల్ ఉద్యోగాల కోసం ఉచిత ఆన్‌లైన్ శిక్షణ ఇవ్వనున్నట్లు ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండు నెలలపాటు సాగే శిక్షణకు ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలని, ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోలేనివారు నేరుగా సుదిమళ్ల(ఇల్లెందు) వైటీసీలో సంప్రదించాలని సూచించారు. పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలని, ఈ నెల 15న ఆన్‌లైన్‌లో పరీక్ష నిర్వహించి అభ్యర్థులను ఎంపిక చేస్తామని తెలిపారు. వివరాలకు 81061 41505 నంబరులో సంప్రదించాలని కోరారు.

క్లుప్తంగా

అయోధ్య నుంచి భద్రగిరికి తలంబ్రాలు



రామాలయానికి తలంబ్రాలను తీసుకొస్తున్న భక్తులు

భద్రాచలంటౌన్: ఉత్తర్‌ప్రదేశ్‌లోని అయోధ్య రామాలయం నుంచి శుక్రవారం భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామివారి దేవస్థానానికి కల్యాణ తలంబ్రాలను తీసుకొచ్చారు. పట్టణ శివారు నుంచి తలంబ్రాలను విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో రామాలయం వరకు శోభాయాత్రగా తీసుకొచ్చి అప్పగించారు.

నాగుల్‌మీరా దర్గాలో అయ్యప్ప పడిపూజ



పడి పూజలో పాల్గొన్న మాలధారులు

ఇల్లెందురూరల్: మండలంలోని సత్యనారాయణపురం శివారు హజ్రత్ నాగుల్‌మీరా దర్గాలో శుక్రవారం రాత్రి అయ్యప్ప పడిపూజ నిర్వహించారు. ఈసందర్భంగా మాలధారులు దర్గా ప్రాంగణంలో అయ్యప్ప విగ్రహాన్ని ప్రతిష్ఠించి గురుస్వామి పర్యవేక్షణలో పూజలు చేశారు. పడిపూజకు దర్గా ప్రతినిధులు ఏర్పాట్లు సమకూర్చారు.


అండర్-14 రగ్బీ జట్ల ఎంపిక

ఖమ్మం స్పోర్ట్స్: జిల్లా పాఠశాలల క్రీడల సంఘం ఆధ్వర్యాన ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో శుక్రవారం ఉమ్మడి జిల్లాస్థాయి అండర్–14 బాలబాలికల రగ్బీ జట్ల ఎంపిక పోటీలు నిర్వహించారు. ఉమ్మడి జిల్లా నుంచి 40మంది క్రీడాకారులు హాజరుకాగా, ఈనెల 10వ తేదీ నుంచి రంగారెడ్డి జిల్లాలో రాష్ట్రస్థాయి పోటీలకు బాలబాలికల జట్లను ఎంపిక చేశామని ఖమ్మం జిల్లా పాఠశాలల క్రీడల కార్యదర్శి కె.నరసింహమూర్తి తెలిపారు. బాలుర జట్టుకు ఎస్.చరణ్‌సాయి, బి.రాజేష్, బి.చరణ్, బి.మోహన్‌కృష్ణ, ఎస్.సిద్దు, ఎస్‌కె సాజిత్, బి.సంతోష్, విష్ణువర్ధన్, పి.ఉదయ్‌కిరణ్ ఎంపిక కాగా, బాలికల జట్టుకు ఎ.జ్యోతిక, వై.ఉషాశ్రీ, జి.కీర్తన, బి.విద్య, ఎ.గౌతమి, టి.గంగోత్రి, కె.గాయత్రి, ఎస్.లయ, ఎస్.భవాని, ఎస్.కే.హస్రిన్, ఎస్.కే. అసీఫా, డి.హిమవర్షిని, బి.ప్రియవర్షిని, మాధురి, పి.సుప్రియ ఎంపికయ్యారని వెల్లడించారు.

వృద్ధురాలి ఆత్మహత్య

పాల్వంచ: అనారోగ్య సమస్యలు తాళలేక వృద్ధురాలు చింతల చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసుల కథనం మేరకు.. పట్టణంలోని రాంనగర్‌కు చెందిన మహిపతి రామారావు భార్య కళావతి (65) కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతోంది. శుక్రవారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో ఇంటి నుంచి వెళ్లి పాత పాల్వంచ సమీపంలోని చింతల చెరువు బతుకమ్మ ఘాట్ సమీపంలో నీళ్లలో దూకి ఆత్మహత్య చేసుకుంది. గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో వారు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని వెలికితీశారు. భర్త రామారావు ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చలికి తాళలేక వృద్ధురాలు మృతి



తాటి రత్తమ్మ (ఫైల్)

పాల్వంచ: మిచాంగ్ తుపాన్ కారణంగా పెరిగిన చలికి తాళలేక ఓ వృద్ధురాలు మృతి చెందింది. స్థానికుల కథనం మేరకు .. పట్టణంలోని బంగారు జాలకిందిగుంపులో నివసిస్తున్న తాటి రత్తమ్మ (62) ఈదురుగాలులు, చలికి తట్టుకోలేక ఈ నెల 6వ తేదీన మృతి చెందింది. 7వ తేదీన స్థానికులు గుర్తించారు.

విద్యుదాఘాతంతో మూడు గేదెలు మృతి



మృతి చెందిన గేదె వద్ద రోదిస్తున్న మహిళ


ముదిగొండ: మేతకు వెళ్లిన మూడు గేదెలు విద్యుదాఘాతంతో మృతి చెందాయి. ముదిగొండకు చెందిన రైతులు మల్లారపు వీరబాబుకు చెందిన రెండు గేదెలు, మాదారపు బాబుకు చెందిన ఒక గేదె శుక్రవారం మేతకు వెళ్లగా తాజా ఈదురుగాలులతో తెగి పడిన విద్యుత్ తీగలను తాకగా షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందాయి. గేదెల విలువ రూ.3 లక్షల వరకు ఉంటుందని బాధిత రైతులు తెలిపారు. ఈ విషయాన్ని విద్యుత్‌శాఖ ఏఈ శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.12,454

'నోటా'కు తగ్గుదల..



- ఈసారి ఉమ్మడి జిల్లాలో నోటాకు 12,548 ఓట్లు
- ఖమ్మంలో అత్యధికం.. పాలేరులో అత్యల్పం
- గత ఎన్నికలతో పోలిస్తే 5 వేలకు పైగా తక్కువ

గత రెండు ఎన్నికలు, తాజా ఎన్నికల్లో 'నోటా'కు నమోదైన ఓట్లు

నియోజకవర్గం	2014	2018	2023
ఖమ్మం	1,408	3,513	1,925
పాలేరు	783	1,271	520
వైరా	912	2,360	1,230
మధిర	730	1,011	1,453
సత్తుపల్లి	905	1,672	635
కొత్తగూడెం	1,356	1,103	1,427
అశ్వారావుపేట	1,145	2,053	1,363
పినపాక	1,480	868	905
ఇల్లెందు	1,173	1,915	1,418
భద్రాచలం	980	2,106	1,672
మొత్తం	10,872	17,872	12,548

సుజాతనగర్: ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో ఈసారి 'నోటా'కు ఓటేసిన వారి సంఖ్య తగ్గింది. చట్టసభలకు ప్రజాప్రతినిధులను ఎన్నుకోవడంలో ఓటు హక్కు కీలకమైనది. అయితే, పోటీలో ఉన్న అభ్యర్థులెవరూ నచ్చకపోయినా ఓటు వేసేలా కేంద్రం ఎన్నికల సంఘం నోటాను ప్రవేశపెట్టింది. అందరూ ఓటుహక్కు వినియోగించుకోవాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకోగా, గత ఎన్నికల్లో గణనీయంగా ఓట్లు నమోదయ్యాయి. కానీ ఈసారి 'నోటా'కు బదులు అభ్యర్థుల్లో ఎవరికో ఒకరికి ఓటు వేయాలనే భావనకు ఓటర్లు వచ్చినట్లు తెలుస్తోంది. తద్వారా గత ఎన్నికలతో పోలిస్తే ఈసారి నోటాకు పోలైన ఓట్లు తగ్గాయి. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పది అసెంబ్లీ నియోజకవర్గాల్లో 2014 ఎన్నికల్లో 10,872 ఓట్లు, 2018 ఎన్నికల్లో 17,872 ఓట్లు నోటాకు వేశారు. ఈ ఎన్నికలకు వచ్చేసరికి 'నోటా'కు 12,548 ఓట్లు మాత్రమే పోలయ్యాయి.

నియోజకవర్గాల వారీగా..

2018 ఎన్నికల్లో ఖమ్మంలో 3,513 ఓట్లు నోటాకు రాగా.. ఈ ఎన్నికల్లో 1,925 ఓట్లు పోలయ్యాయి. ఈ నియోజకవర్గంలో 32 మంది అభ్యర్థులు బరిలో నిలవగా తుమ్మల నాగేశ్వరరావు విజయం సాధించారు. తుమ్మల నాగేశ్వరరావుకు 1,36,016 ఓట్లు లభించాయి. మధిర నుంచి 15 మంది అభ్యర్థులు పోటీ పడగా భట్టి విక్రమార్క 1,08,970 ఓట్లు సాధించారు. నోటాకు ఇక్కడ 1,453 ఓట్లు పోలయ్యాయి. పాలేరులో 37 మంది అభ్యర్థులు పోటీచేయగా పొంగులేటి శ్రీనివాసరెడ్డికి 1,27,820 ఓట్లు వచ్చాయి. నోటాకు అతితక్కువగా ఇక్కడ 520 మంది ఓటేశారు. వైరాలో 12 మంది పోటీ చేయగా మాలోత్ రాందాస్‌నాయక్ 93,913 ఓట్లు సాధించారు. నోటాకు ఇక్కడ 1,230 ఓట్లు పోలయ్యాయి. సత్తుపల్లిలో 23 మంది పోటీలో నిలవగా మట్టా రాగమయి 1,11,245 ఓట్లు దక్కించుకున్నారు. నోటాకు ఈ నియోజకవర్గంలో 635 ఓట్లు పోలయ్యాయి. అశ్వారావుపేటలో 14 మంది పోటీ చేయగా జారె ఆదినారాయణ 74,993 ఓట్లు సాధించారు. నోటా బటన్‌ను ఇక్కడ 1,363 మంది నొక్కారు. భద్రాచలంలో 13 మంది పోటీ చేశారు. డాక్టర్ తెల్లం వెంకటరావు ఇక్కడ 53,252 ఓట్లు దక్కించుకున్నారు. ఈ నియోజకవర్గంలో నోటాకు ఇక్కడ 1,672 ఓట్లు పోలయ్యాయి. ఇక పినపాకలో 18 మంది పోటీ చేయగా పాయం వెంకటేశ్వర్లు 90,510 ఓట్లు సాధించారు. 905 ఓట్లు నోటాకు పోలయ్యాయి. ఇల్లెందులో 20 మంది పోటీ చేయగా కోరం కనకయ్య 1,09,171 ఓట్లు సాధించి గెలుపొందారు. నోటాకు ఇక్కడ 1,418 ఓట్లు దక్కాయి. కొత్తగూడెం నియోజకవర్గంలో 30 మంది అభ్యర్థులు పోటీలో నిలవగా కూనంనేని సాంబశివరావు విజయం సాధించారు. కూనంనేని సాంబశివరావుకు 80,336 ఓట్లు పోలవ్వగా.. ఈ నియోజకవర్గంలో నోటాకు 1,427 ఓట్లు వచ్చాయి. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పది నియోజకవర్గాల్లో చాలా మంది స్వతంత్రులుగా పోటీ చేయగా మరి కొందరు ఇతర పార్టీల నుంచి పోటీ చేశారు. చాలాచోట్ల వీరు సాధించిన ఓట్ల కన్నా నోటాకు ఎక్కువ ఓట్లు పోలవ్వడం విశేషం.

కలెక్టరేట్‌లో సంబురాలు



కేక్ కట్ చేస్తున్న టీఎన్‌జీవోస్ బాధ్యులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): కొత్త ప్రభుత్వం ఏర్పాటైన సందర్భంగా కేంద్ర సంఘం పిలుపు మేరకు తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం (టీఎన్‌జీవోస్) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం కేక్ కట్ చేసి సంబురాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎ.రామారావు, జి.వీరబాబు, సీహెచ్ రాంనర్సయ్య, ఎస్‌కే ఇమ్రాన్‌పాషా, జి.ఉష, ఎం.ఉష, జె.సోమయ్య, ఎం.విజయలక్ష్మి, జానీమియా పాల్గొన్నారు.

తుపాన్ బాధిత రైతులను ఆదుకోండి



మాట్లాడుతున్న హేమంతరావు

ఖమ్మంమయూరిసెంటర్: మిచాంగ్ తుపాన్‌తో పంటలు దెబ్బతిన్న రైతులను ఆదుకునేలా ప్రభుత్వం తక్షణం కార్యాచరణ చేపట్టాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాగం హేమంతరావు డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా వరి, మిర్చి, పత్తి, మొక్కజొన్న, అపరాల పంటలతో పాటు ఉద్యానవన పంటలు దెబ్బతినడంతో వేలాది మంది రైతులు నష్టపోయారని తెలిపారు. ఖమ్మంలోని సీపీఐ కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో హేమంతరావు మాట్లాడారు. ఏటా ప్రకృతి వైపరీత్యాలతో పంటలు దెబ్బతిని రైతులు నష్టపోతున్నారని తెలిపారు. పెట్టుబడులు కూడావచ్చే పరిస్థితి లేక అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారని చెప్పారు. ఈ నేపథ్యాన తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయడమే కాక పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కాగా, ఉప ముఖ్యమంత్రిగా మల్లు భట్టివిక్రమార్క, మంత్రులుగా తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రమాణ స్వీకారం చేసిన నేపథ్యాన వారికి సీపీఐ తరపున శుభాకాంక్షలు తెలుపుతున్నామని హేమంతరావు పేర్కొన్నారు. ఈ మేరకు ఉమ్మడి జిల్లాను సస్యశ్యామలం చేసేందుకు, ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని కోరారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, నాయకులు జానీమియా, శింగు నర్సింహారావు, రావి శివరామకృష్ణ, మేకల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పంటలను రక్షించుకోండి ఇలా..

- చేలలో ఉన్న నిల్వ నీటిని తొలగించాలి
- తక్షణ చర్యలతోనే తెగుళ్ల నివారణ సాధ్యం
- ఎండ, గాలి తగిలేలా పంట ఆరబెడితే ఫలితం
- వ్యవసాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు



రఘునాథపాలెం మండలం మల్లేపల్లిలోని ఓ రైతు వరి పొలంలో చేరిన వరద (ఫైల్)

ఖమ్మంవ్యవసాయం: మిచాంగ్ తుపాను పంటలపై బీభత్సం సృష్టించింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మూడు రోజుల పాటు తుపాను ప్రభావం నెలకొనగా.. చేతికందే దశలో ఉన్న వరి, పత్తి, మిర్చి, మొక్కజొన్న వంటి పంటలు నేలకొరిగాయి. కోత దశలో ఉన్న వరి నేలవాలగా, చాలాచోట్ల ధాన్యం తడిచిపోయింది. పత్తి పైర్లు నిలువునా దెబ్బతిన్నాయి. మిర్చి పంట పరిస్థితి అలాగే ఉండటంతో మిగిలిన పంటలను ఎలా కాపాడుకోవాలా అని రైతులు తల్లడిల్లుతున్నారు. ఈ నేపథ్యాన పంటలను రక్షించుకునేందుకు తీసుకోవాల్సిన చర్యలను వ్యవసాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తలు వెల్లడించారు. ఈ సందర్భంగా వారు రైతులకు ఇచ్చిన సలహాలు, సూచనలు ఇలా ఉన్నాయి.

వరి

తుపాను ప్రభావం తగ్గినందన పొలంలో ఉన్న నీటిని పూర్తిగా తీసివేయాలి. కర్రలు, ఇనుప తీగల సాయంతో పైరుకు ఊతమిచ్చి నిలబెట్టాలి. నీటిలో తడిచిన వరి గింజలు మొలకెత్తే అవకాశం ఉంది. పంటను రక్షించుకునేందుకు లీటర్ నీటికి 20 గ్రాముల ఉప్పు కలిపి వరి గింజలు తడిచేలా పిచికారీ చేయాలి. వరి గింజలు తడవటం, చల్లటి వాతావరణ పరిస్థితులు ఉండటంతో మానిపండు తెగులు ఆశించే అవకాశం కూడా ఉంది. దీని నివారణకు ప్రొపికొనజోల్ 1.0 మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. వాతావరణం పొడిగా ఉన్న సమయంలో రాశులపై ఉన్న టార్పాలిన్లు తొలగించి ఆరబెట్టాలి. వాతావరణాన్ని గమనిస్తూ వరి కోతలు సాగించాలి.

మిర్చి

మిరప పైరులో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి. పంటకు నీటి తడులు ఇవ్వరాదు. మిరప పంటలో అధిక తేమ, నీరు నిల్వ ఉంటే ఎండు తెగులు, వేరు కుళ్లు తెగులు ఆశించే అవకాశం ఉంటుంది. వీటి నివారణకు లీటర్ నీటికి 3 గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్ లేదా 3 గ్రాముల మాంకోజెబ్ లేదా 2.5 గ్రాముల మెటలాక్సిల్ + మాంకొజెబ్ మందును కలిపి ఆ ద్రావణాన్ని మొక్కల మొదళ్ల దగ్గర పోయాలి. ప్రస్తుతం చల్లటి వాతావరణ పరిస్థితులు ఉండటంతో మిరపలో బూడిద, కాయ కుళ్లు తెగులు ఆశించే అవకాశం కూడా ఉంది. వీటి నివారణకు లీటర్ నీటికి 3 గ్రాముల కాపర్ ఆక్సీ క్లోరైడ్ లేదా 2.5 గ్రాముల మాంకోజెబ్ లేదా 0.4 గ్రాముల ట్రైఫ్లాక్సీస్ట్రోబిన్ 25 శాతం + టేబుకొనజోల్ 50 శాతం లేదా 1.0 మి.లీ. అజాక్సీస్ట్రోబిన్ లేదా 0.4 గ్రాముల మైక్లోబ్యూటానిల్ లేదా 1.0 మి.లీ. అజాక్సీస్ట్రోబిన్ + టేబుకొనజోల్ మందు కలిపి 8 నుంచి 10 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి. వర్షం తగ్గటంతో మిరపలో పూత రాలడాన్ని నివారించేందుకు లీటర్ నీటికి 5 – 10 గ్రాముల సూక్ష్మ పోషకాలు లేదా 13-0-15 లేదా 19-19-19 లేదా 28-28-0 కలిపి పిచికారీ చేయాలి.

మొక్కజొన్న, ఇతర పంటలు

నేలలోని అధిక తేమ శాతం కారణంగా మొక్కజొన్న పంట పోషకాలను నేల నుంచి త్వరగా సంగ్రహించలేవు. ప్రస్తుతం వర్షాలు తగ్గినందున ఎకరాకు 20 కిలోల యూరియా, 10 కిలోల పొటాష్ ఎరువులను వేసుకోవాలి. లేదా పైపాటుగా 13-0-45 లేదా యూరియా లేదా 19-19-19 వంటి పోషక ఎరువులను 10 గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి. వర్షం తగ్గిన క్రమంలో పత్తిని తీసి ఎండ, గాలి తగిలే విధంగా ఆరబెట్టాలి. వేరుశనగ పంట వర్షానికి తడిస్తే, టార్పాలిన్ పట్టాలను పరిచి ఎండ, గాలి తగిలేలా ఆరబెట్టాలి. పొలంలో అధికంగా నీరు ఉన్నప్పుడు ఎరువు వేయరాదు. అలా వేస్తే ఎరువులు వృథా అవుతాయి.

ప్రశాంతంగా ముగిసిన పీఎల్‌జీఏ వారోత్సవాలు

చర్ల: మావోయిస్టు పార్టీ పీఎల్‌జీఏ వారోత్సవాలు ప్రశాంతంగా ముగిశాయి. డిసెంబర్ 2 నుంచి 8 వరకు పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ 23వ వారోత్సవాలను నిర్వహించాలని పిలుపునిచ్చిన మావోయిస్టు పార్టీ విధ్వంసాలకు దిగవచ్చన్న అనుమానంతో పోలీస్ యంత్రాంగం అప్రమత్తంగా వ్యవహరించింది. మండలంతో పాటు సరిహద్దు గ్రామాల్లో భారీగా తనిఖీలు నిర్వహించడంతో పాటు ఛత్తీస్‌గఢ్ – తెలంగాణ సరిహద్దు అటవీ ప్రాంతాల్లో సీఆర్‌పీఎఫ్, స్పెషల్ పార్టీ, గ్రేహౌండ్స్, కోబ్రా పోలీస్ బలగాలు వారం పాటు కూంబింగ్ నిర్వహించాయి. సరిహద్దులో ఉన్న ఆదివాసీ గ్రామాల నుంచి ఎవరెవరు వారోత్సవాలకు వెళ్తున్నారు? ఎక్కడెక్కడ వారోత్సవ సభలు నిర్వహిస్తున్నారన్న వివరాలను ఎప్పటికప్పుడు సేకరిస్తూ చర్యలను కట్టుదిట్టం చేశారు. సరిహద్దు అటవీ ప్రాంతంలో కూంబింగ్‌కు వెళ్లిన పోలీసు బలగాలు వారోత్సవాలు ముగియడంతో తిరుగు పయనమయ్యాయి. వారోత్సవాలు ప్రశాంతంగా ముగియడంతో అటు పోలీసులు ఇటు రాజకీయ నాయకులు ఊపిరి పీల్చుకున్నారు.

ఇంటర్‌నెట్ సెంటర్‌లో చోరీ

కొణిజర్ల: మండలంలోని తనికెళ్లలో నిర్వహిస్తున్న ఇంటర్‌నెట్ సెంటర్‌లో ఓ యువకుడు చోరీకి పాల్పడ్డాడు. తనికెళ్లకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు మేకల శ్రీనివాసరావు ఇంట్లో ఆయన భార్య చంద్రిక ఇంటర్‌నెట్ సెంటర్ నిర్వహిస్తోంది. శుక్రవారం మధ్యాహ్నం సెంటర్‌లో ఎవరూ లేనిది గుర్తించిన ఓ యువకుడు గల్లాపెట్టె నుంచి రూ.10,250 నగదు ఎత్తుకెళ్లాడు. ఈ విషయం సీసీ కెమెరా ఫుటేజీ ద్వారా సాయంత్రం గుర్తించిన శ్రీనివాసరావు ఫిర్యాదుతో కేసు నమోదుచేసినట్లు ఎస్‌ఐ శంకరరావు తెలిపారు.

ఆంజనేయస్వామి ఆలయంలో చోరీ



హుండీ తాళాలు పగులగొట్టిన దృశ్యం

పాల్వంచ: పట్టణంలోని పాత పాల్వంచలోని ఆంజనేయ స్వామి ఆలయంలో చోరీ జరిగింది. ఆలయ ధర్మకర్త సుంకర వీరభద్రరావు కథనం మేరకు.. గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఆలయంలోకి ప్రవేశించి హుండీకి ఉన్న తాళాలు పగులగొట్టారు. అందులోని సుమారు రూ.10 వేల నగదును చోరీ చేశారు. శుక్రవారం తెల్లవారుజామున చోరీ జరిగిన విషయాన్ని గుర్తించారు.

కల్తీ పెట్రోల్ పోశారని ఆందోళన



ఆందోళన చేస్తున్న వాహనదారులు

సత్తుపల్లిటౌన్: నీళ్ల పెట్రోల్ పోస్తున్నారంటూ వాహనదారులు శుక్రవారం సత్తుపల్లి మండలం గంగారంలో ఆందోళనకు దిగారు. గంగారం శివారులోని హెచ్‌పీ బంక్‌లో పలువురు పెట్రోల్ కొట్టించుకొని కొద్దిదూరం వెళ్లేసరికే వాహనాలు ఆగిపోయాయి. దీంతో మెకానిక్‌లను సంప్రదించగా కల్తీ పెట్రోలే కారణమని చెప్పడంతో బంక్‌కు వచ్చి సిబ్బందిని నిలదీశారు. కాగా, వర్షంతో ట్యాంకులోకి నీళ్లు చేరి ఉండొచ్చని బంక్ సిబ్బంది బదులివ్వగా ఆందోళన చేపట్టారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు వెళ్లి నచ్చజెప్పి ఆందోళన విరమింపచేశారు. కల్తీ విషయాన్ని అధికారులు, బంక్ యజమాని దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.

ఆశ్రమ పాఠశాల నుంచి ఇద్దరు విద్యార్థినుల అదృశ్యం

- హెచ్‌ఎం ఫిర్యాదు మేరకు కేసు

ఇల్లెందు: ఇల్లెందు గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల (పాత)లో 5, 6 తరగతులు చదువుతున్న మండలంలోని ఏడిప్పలగూడెం గ్రామానికి చెందిన ఇద్దరు విద్యార్థినులు శుక్రవారం ఉదయం నుంచి కనిపించకుండాపోయారు. హెచ్‌ఎం పద్మావతి ఆరా తీయగా ఇద్దరు విద్యార్థినులు పాఠశాలలో లేకపోవటంతో వారి కుటుంబ సభ్యులకు సమాచారం అందించి బంధువుల ఇళ్లల్లో సోదాలు చేశారు. అయినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్‌ఐ రవూఫ్ విచారణ జరిపి కేసు నమోదు చేశారు. నవంబర్ 1 నుంచి విద్యార్థినులు ఆశ్రమ పాఠశాలలో ఉన్నట్లు హాజరు పట్టికలో ఉంది. ఈ విషయమై ఎస్‌ఐ రవూఫ్‌ను వివరణ కోరగా హెచ్‌ఎం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

జూదరులు అరెస్ట్

చుంచుపల్లి: చుంచుపల్లితండాలో పేకాట ఆడుతున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు శుక్రవారం పోలీసులు దాడి చేశారు. ఈ క్రమంలో పేకాడుతున్న అదే గ్రామానికి చెందిన ఐదుగురిని అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.9 వేల నగదు స్వాధీనం చేసుకున్నామని, కేసు నమోదు చేశామని చుంచుపల్లి పోలీసులు తెలిపారు.

రూ.60 వేల విలువైన సొత్తు చోరీ

నేలకొండపల్లి: మండలంలోని కొత్తకొత్తూరుకు చెందిన ఒకరి ఇంట్లో చోరీ జరిగింది. ఎస్సై బి.సతీష్ కథనం ప్రకారం.. కొత్తకొత్తూరుకు పేరాల చలమరావు వ్యక్తి కుటుంబంతో సహా సూర్యాపేట వెళ్లారు. ఇది గమనించిన దుండగులు ఇంటి తాళం, బీరువా తాళం పగలగొట్టి అందులో ఉన్న రూ.20 వేల నగదు, రెండు ఉంగరాలను చోరీ చేశారు. ఈవిషయాన్ని శుక్రవారం వచ్చిన చలమరావు గుర్తించి రూ.60 వేల విలువైన సొత్తు చోరీకి గురైనట్లు చేసిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

అదుపు తప్పి చెట్టును ఢీకొట్టిన లారీ

కేబిన్‌లో ఇరుక్కుపోయిన డ్రైవర్



పల్టీ కొట్టి చెట్టుకు ఢీకొన్న లారీ



కేబిన్‌లో ఇరుక్కుపోయిన డ్రైవర్ బుచ్చిరెడ్డి

కొణిజర్ల: అదుపు తప్పిన లారీ పల్టీ కొట్టడమే కాక చెట్టును ఢీకొట్టి ఆగిపోయింది. ఈ ఘటనలో కేబిన్‌లో డ్రైవర్ ఇరుక్కుపోగా గంట పాటు శ్రమించిన పోలీసులు బయటకు తీశారు. దీంతో గంట పాటు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. కొణిజర్ల మండలం పల్లిపాడు సమీపాన శుక్రవారం జరిగిన ఈ ప్రమాదం వివరాలను ఎస్‌ఐ జె.శంకరరావు వెల్లడించారు. నల్లగొండ జిల్లా వలిగొండ నుంచి బియ్యం లోడుతో కాకినాడ వెళ్తున్న లారీ పల్లిపాడు కోల్డ్ స్టోరేజీ సమీపాన అదుపు తప్పి పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో లారీ కేబిన్ చెట్టును ఢీకొనడంతో డ్రైవర్ బుచ్చిరెడ్డి అందులోనే ఇరుక్కుపోయాడు. క్లీనర్ రవీందర్ బయటకు దూకి స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. దాదాపు 40 టన్నుల బియ్యం ఉండడంతో లారీని పక్కకు జరిపి డ్రైవర్‌ను బయటకు తీయడానికి పోలీసులు గంట పాటు శ్రమించాల్సి వచ్చింది. ఘటనలో డ్రైవర్ బుచ్చిరెడ్డి రెండు కాళ్లు విరగగా, ఆస్పత్రికి తరలించాక ఈ మార్గంలో భారీగా నిలిచిన వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించారు.

అండగా నేనున్నా..


తుపాను ప్రభావిత ప్రాంతాల్లో బాధితులకు ఏపీ సీఎం జగన్ ఓదార్పు


బాపట్ల జిల్లా పాతనందాయపాలెంలో వర్షానికి తడిసిన వరి కంకులను పరిశీలిస్తూ రైతులతో మాట్లాడుతున్న సీఎం జగన్

సాక్షి తిరుపతి: అధైర్యపడొద్దు.. అండగా నేనున్నానంటూ తుపాను బాధితులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భరోసా కల్పించారు. మిచాంగ్ తుపాను ప్రభావిత ప్రాంతాల పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి జగన్ శుక్రవారం తిరుపతి, బాపట్ల జిల్లాల్లో పర్యటించి బాధితులను స్వయంగా కలుసుకుని పరామర్శించారు. పంట చేతికొచ్చే సమయంలో రైతన్నకు జరిగిన అపార నష్టాన్ని చూసి చలించిపోయారు. ఖరీఫ్ సీజన్ ముగిసేలోగా ఇన్‌పుట్ సబ్సిడీ ఇస్తామని, పంట నష్టపోయిన రైతులకు 80 శాతం రాయితీతో శనగ విత్తనాలను సరఫరా చేస్తామని తెలిపారు. తిరుపతి నుంచి మొదలుపెడితే సుదీర్ఘ కోస్తా తీరం మొత్తాన్ని తుపాన్ తీవ్రంగా దెబ్బ తీసిందని, ఎప్పుడూ చూడని వర్షం నాలుగు రోజుల్లోనే కురవడంతో పొలాల్లో నీరు నిలిచిపోయి రైతన్నలకు అపార నష్టం వాటిల్లిందన్నారు. ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా తీసుకొచ్చిన వలంటీర్లు, సచివాలయాల వ్యవస్థ ద్వారా పారదర్శకంగా అందరినీ ఆదుకుంటామని హామీ ఇచ్చారు. విపత్తు వేళ అధికార యంత్రాంగం వెంటనే అప్రమత్తమై బాధిత ప్రాంతాల్లో విద్యుత్తు పునరుద్ధరణకు చర్యలు తీసుకుందన్నారు. గన్నవరం నుంచి రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్న సీఎం జగన్ తొలుత తిరుపతి, శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాలోని తుపాను బాధిత ప్రాంతాలను ఏరియల్ సర్వే ద్వారా పరిశీలించారు. అనంతరం కోట మండలం విద్యానగర్‌కు చేరుకున్నారు. అక్కడి నుంచి రోడ్డు మార్గాన వాకాడు మండలం బాలిరెడ్డిపాలెం గ్రామానికి చేరుకుని కోతకు గురైన స్వర్ణముఖి నది, వరి పంటలను పరిశీలించారు. స్వర్ణముఖి కోతకు గురి కావటానికి కారణాలను ఆరా తీశారు. బాలిరెడ్డిపాలెంలో తుపాను బాధితులతో నేరుగా మాట్లాడారు.

బాబు కోర్టు ధిక్కారం

- బెయిల్ షరతులు ఉల్లంఘించి మరీ ఉపన్యాసం
- తుపాను ప్రభావిత ప్రాంతాల పర్యటనలో తన కేసు గురించి ప్రస్తావన
- స్కిల్ స్కాం గురించి మాట్లాడకూడదని చెప్పిన హైకోర్టు, సుప్రీంకోర్టు
- కోర్టు ఆదేశాలను పట్టించుకోకుండా ప్రసంగం
- తప్పు చేయకుండా తనను జైల్లో పెట్టారంటూ వ్యాఖ్యలు



సాక్షి, అమరావతి: స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో అరెస్టయి బెయిల్‌పై బయట ఉన్న చంద్రబాబు బెయిల్ షరతులను యథేచ్ఛగా ఉల్లంఘించారు. తుపాను ప్రభావిత ప్రాంతాల పర్యటనకు వెళ్లి అక్కడ తన అరెస్టు, జైలు గురించి ప్రసంగించి కోర్టు ఆదేశాలను ధిక్కరించారు. హైకోర్టు, సుప్రీంకోర్టు ఆదేశాలకు విరుద్ధంగా తన అరెస్టు గురించి మాట్లాడి కోర్టులంటే తనకు లెక్కలేదన్నట్లుగా వ్యవహరించారు. స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణం కేసులో అరెస్టయి రాజమహేంద్రవరం సెంట్రల్ జైల్లో ఉన్న చంద్రబాబుకు అక్టోబర్ 31న హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఈ కేసు గురించి ఎక్కడా ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ మాట్లాడకూడదని హైకోర్టు బెయిల్ ఆర్డర్‌లో స్పష్టంగా పేర్కొంది. కేసులోని విషయాల గురించి బయట ఎక్కడా చర్చించవద్దని స్పష్టంచేసింది. అలాగే, హైకోర్టు ఆదేశాలను చంద్రబాబు తప్పకుండా పాటించాలని, స్కిల్ డెవలప్‌మెంట్ కేసు గురించి ఎక్కడా మాట్లాడకూడదని సుప్రీం కోర్టు కూడా ఆదేశించింది. అయితే, చంద్రబాబు మాత్రం వీటిని బహిరంగంగా ఉల్లంఘించారు. గుంటూరు జిల్లా తెనాలి నియోజకవర్గంలోని కొల్లిపర మండలం అత్తోటలో శుక్రవారం తుపాను బాధితులను పరామర్శించి అక్కడ రాజకీయ ప్రసంగం చేశారు. తుపాను దెబ్బకు అన్ని విధాలుగా నష్టపోయి రైతులు ఆందోళనలో ఉంటే చంద్రబాబు మాత్రం అక్కడకు వెళ్లి తనను అన్యాయంగా అరెస్టు చేశారని, ఏ తప్పు చేయకుండా జైల్లో పెట్టారంటూ స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణం కేసు గురించి మాట్లాడారు.

45 ఏళ్లుగా టెక్నికల్‌గా, లీగల్‌గా తప్పుచేయలేదు..

తనలాంటి వాళ్లను కూడా జైల్లో పెట్టేయగలుగుతున్నారని, బాధ కలగదా అంటూ చంద్రబాబు వ్యాఖ్యానించారు. 45 ఏళ్లుగా తానెక్కడా ఒక్క తప్పు కూడా చేయలేదని, టెక్నికల్‌గా, లీగల్‌గా ఒక్క తప్పూ చేయకుండా ఉన్నానని, అలాంటి తనను జైల్లో పెట్టారని చెప్పారు. ఎలాంటి తప్పు కూడా చేయకుండా ఉన్న పళంగా కేసు బుక్‌చేసి లోపలేశాడని సీఎంను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. తాను కూడా మనిషినేనని, తనకూ బాధలు ఉంటాయని, తనకూ మనసు ఉంటుందని, చేయని తప్పుకి శిక్ష అనుభవిస్తే ఎలా ఉంటుందంటూ ప్రజల సానుభూతి కోసం ఆయన ప్రయత్నించారు. తన కోసం 52 రోజులుగా అందరూ వీరోచితంగా పోరాడారని, తనను అరెస్టుచేస్తే అందరినీ బెదిరించవచ్చనే ఉద్దేశంతో సీఎం ఇలా చేసినట్లు చంద్రబాబు పరోక్ష వ్యాఖ్యలు చేశారు.

న్యాయకోవిదుల విస్మయం..

బెయిల్ షరతులను ఉల్లంఘించి తాను అరెస్టయిన కేసు గురించి చంద్రబాబు మాట్లాడడంపై న్యాయకోవిదులు విస్మయం వ్యక్తంచేస్తున్నారు. బెయిల్ పొందినప్పుడు కోర్టు ఆదేశాల ప్రకారం నడుచుకుంటానని చెప్పి బయటకు వచ్చాక ఇష్టం వచ్చినట్లు వ్యవహరించడం సరికాదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. తుపాను ప్రభావిత ప్రాంతాల పర్యటనలో అందుకు సంబంధించిన విషయాల గురించి కాకుండా తాను జైలుపాలవడం, కేసుల గురించి మాట్లాడడం ఏమిటనే ప్రశ్నలు సాధారణ ప్రజానీకం నుంచి వినిపిస్తున్నాయి. ఇక అనారోగ్య కారణాలతో మధ్యంతర బెయిల్‌పై బయటకు వచ్చినప్పుడు కూడా రాజమహేంద్రవరం నుంచి విజయవాడకు గంటల తరబడి ర్యాలీ చేసుకుంటూ వచ్చి ఆయన కోర్టు ఆదేశాలను ఉల్లంఘించారు. తనకు ఆరోగ్యం బాగోలేదని బెయిల్ తీసుకుని భారీఎత్తున ర్యాలీలు చేయడంపై అప్పట్లో విమర్శలు వెల్లువెత్తాయి. అలాగే, విజయవాడ ఏసీబీ కోర్టు ఈ కేసులోనే ఆయనకు రిమాండ్ విధించినప్పుడు సైతం న్యాయమూర్తిని లక్ష్యంగా చేసుకుని టీడీపీ నాయకులు, కార్యకర్తలు విపరీతంగా కామెంట్లు చేశారు. సోషల్ మీడియాలో న్యాయమూర్తిని అసభ్యపదజాలంతో దూషిస్తూ పోస్టులు పెట్టారు. చంద్రబాబు జైల్లో ఉన్నన్ని రోజులు ఆయన కుమారుడు లోకేశ్, ఇతర నాయకులు కోర్టులను మేనేజ్ చేశారంటూ న్యాయ వ్యవస్థను కించపరిచేలా మాట్లాడారు. చివరికి అదే న్యాయ వ్యవస్థ నుంచి చంద్రబాబు బెయిల్ పొంది బయటకొచ్చారు. ఇప్పుడు ఆ కోర్టు ఆదేశాలనే ధిక్కరిస్తూ స్కిల్ కుంభకోణం గురించి రాజకీయ ఉపన్యాసం చేయడం గమనార్హం.

చంద్రబాబు బెయిల్ రద్దు పిటిషన్‌పై విచారణ వాయిదా



సాక్షి, న్యూఢిల్లీ : స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణం కేసులో టీడీపీ అధినేత చంద్రబాబు బెయిల్ రద్దు చేయాలంటూ ఏపీ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను సుప్రీంకోర్టు వాయిదా వేసింది. ఈ పిటిషన్ శుక్రవారం జస్టిస్‌బేలా ఎం త్రివేది, జస్టిస్ సతీష్ చంద్ర శర్మలతో కూడిన ధర్మాసనం ముందుకొచ్చింది. ఈ కేసులో ప్రతివాది కౌంటరు దాఖలు చేయలేదని రాష్ట్ర ప్రభుత్వం తరపు సీనియర్ న్యాయవాది రంజిత్‌కుమార్ ధర్మాసనం దృష్టికి తెచ్చారు. స్కిల్ కుంభకోణం కేసులో పీడీ చట్టం సెక్షన్ 17ఏ పై తీర్పు ఇంకా వెలువరించలేదని చంద్రబాబు తరపు న్యాయవాది హరీష్ సాల్వే ధర్మాసనానికి తెలిపారు. తీర్పు ఇచ్చేలా ఉంటే వాయిదా వేయాలని, లేదంటే తదుపరి విచారణ తేదీ తెలపాలని ధర్మాసనాన్ని కోరారు. కౌంటరు దాఖలు చేస్తామని ధర్మాసనానికి తెలిపారు. అయితే, తదుపరి విచారణ జనవరి మూడో వారంలో చేపడతామని ధర్మాసనం పేర్కొంది. తేదీ ఖరారు చేయాలని హరీష్ సాల్వే కోరగా.. జనవరి 19కి వాయిదా వేస్తున్నామని, అప్పటి లోగా కౌంటరు దాఖలు చేయాలని ఆదేశించింది. అదే సమయంలో రాష్ట్ర ప్రభుత్వం రిజాయిండర్ దాఖలు చేయాలని ధర్మాసనం పేర్కొంది.

ఏపీలో గ్రూప్-1 నోటిఫికేషన్ విడుదల

- 81 పోస్టులు భర్తీ చేయనున్న ఏపీపీఎస్సీ
- జనవరి 1 నుంచి 21 వరకు ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ
- మార్చి 17న ఆఫ్‌లైన్‌లో ప్రిలిమ్స్ నిర్వహణ
- ఈ నెలాఖరుకు మరిన్ని నోటిఫికేషన్లు

సాక్షి, అమరావతి: రాష్ట్ర స్థాయిలో అత్యున్నత సర్వీసులైన గ్రూప్-1 పోస్టుల భర్తీకి ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) శుక్రవారం నోటిఫికేషన్ జారీ చేసింది. మొత్తం 81 గ్రూప్-1 పోస్టులను భర్తీ చేయనున్నట్టు ప్రకటించింది. గురువారం 897 గ్రూప్-2 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చిన సర్వీస్ కమిషన్ తాజాగా గ్రూప్-1 పోస్టులకుసైతం నోటిఫికేషన్‌జారీ చేసింది. అభ్యర్థులు తమ వన్ టైమ్ ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ (ఓటీపీఆర్) ఆధారంగా జనవరి 1 నుంచి 21వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొంది. కొత్త అభ్యర్థులు తొలుత కమిషన్ వెబ్‌సైట్‌లో తమ ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ చేసుకుని, ఓటీపీఆర్‌తో దరఖాస్తు చేసుకోవాలి. ప్రిలిమినరీ పరీక్ష ఆబ్జెక్టివ్ తరహాలో మార్చి 17న ఆఫ్‌లైన్‌లో నిర్వహించనున్నట్టు సర్వీస్ కమిషన్ పేర్కొంది. డిస్క్రిప్టివ్ విధానంలో జరిగే మెయిన్స్ పరీక్షల షెడ్యూల్‌ను త్వరలో ప్రకటించనుంది. కమిషన్ ప్రకటించిన గ్రూప్-1 విభాగంలో 9 డిప్యూటీ కలెక్టర్లు, 18 అసిస్టెంట్ ట్యాక్స్ కమిషనర్స్ పోస్టులు, 26 డిప్యూటీ పోలీస్ సూపరింటెండెంట్స్, ఆర్టీవో, గ్రేడ్-2 మున్సిపల్ కమిషనర్స్, జిల్లా బీసీ సంక్షేమ వంటి ఉన్నత స్థాయి పోస్టులు ఉన్నాయి. గ్రూప్ 1 ప్రిలిమ్స్‌లో రెండు పేపర్లు సైతం ఆఫ్‌లైన్‌లో ఆబ్జెక్టివ్ విధానంలోనే నిర్వహించనున్నారు. మొత్తం పోస్టులు, వేతనం, అర్హతలతో కూడిన పూర్తి సమాచారం కమిషన్ వెబ్‌సైట్ https://psc.ap.gov.inలో ఉంచినట్టు కార్యదర్శి ప్రదీప్ కుమార్ తెలిపారు. కాగా, ఇప్పటికే ఆర్థికశాఖ అనుమతినిచ్చిన మరికొన్ని పోస్టులకు ఈ నెలాఖరులోగా నోటిఫికేషన్లు ఇచ్చేందుకు ఏపీపీఎస్సీ ప్రణాళిక సిద్ధం చేసింది.

వివాదరహితంగా పోస్టుల భర్తీ

గతంలో ఉండే అనేక న్యాయపరమైన వివాదాలను, చిక్కులను పరిష్కరించి ప్రభుత్వం సర్వీస్ కమిషన్‌లో సంస్కరణలు తీసుకొచ్చింది. దాంతో గతేడాది ఏపీపీఎస్సీ ఇచ్చిన గ్రూప్-1 నోటిఫికేషన్ ద్వారా ఎలాంటి వివాదాలకు తావులేకుండా 11 నెలల కాలంలో పూర్తి పారదర్శకంగా మెయిన్స్, ఇంటర్వ్యూలు కూడా పూర్తి చేసింది. గ్రూప్-1 పరీక్షలు, మూల్యాంకనం, అభ్యర్థుల ఎంపిక సమర్థవంతంగా నిర్వహించి, హేతుబద్ధంగా అభ్యర్థుల వాస్తవిక నైపుణ్యాన్ని అంచనా వేసి ఎంపిక చేశారు. ఈ నియామకాలు అతి తక్కువ సమయంలోనే కమిషన్ పూర్తి చేసింది. ఇదే తరహాలో ఇప్పుడు ప్రకటించిన నోటిఫికేషన్లలో ఇచ్చిన పోస్టులు సైతం సమర్థవంతంగా, సత్వరం భర్తీ చేసేందుకు కమిషన్ ఏర్పాట్లు చేస్తోంది.

వైద్యశాఖలో 170 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

సాక్షి, అమరావతి: ఏపీ వైద్య శాఖలోని డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్(డీఎంఈ) పరిధిలో ఉండే ప్రభుత్వ వైద్య కళాశాలల్లో 144, విశాఖపట్నంలోని విమ్స్‌లో 26 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి ఏపీ మెడికల్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ శుక్రవారం నోటిఫికేషన్ జారీ చేసింది. వాక్ ఇన్ రిక్రూట్‌మెంట్ ద్వారా శాశ్వత, కాంట్రాక్ట్ పద్ధతుల్లో పోస్టుల భర్తీ చేయనున్నట్టు బోర్డ్ మెంబర్ సెక్రటరీ ఎం.శ్రీనివాసరావు తెలిపారు. బోధనాస్పత్రుల్లో వివిధ స్పెషాలిటీలలో ఖాళీగా ఉన్న 144 పోస్టుల్ని శాశ్వత ప్రాతిపదికన (డైరెక్ట్/లేటరల్) భర్తీ చేయనున్నారు. ఈ పోస్టుల భర్తీకి ఈనెల 18, 20 తేదీల్లో విజయవాడలోని డీఎంఈ కార్యాలయంలో ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వాక్ఇన్ రిక్రూట్‌మెంట్ నిర్వహిస్తారు. ఇక విమ్స్‌లో 26 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులను కాంట్రాక్ట్ పద్ధతిలో భర్తీ చేయడం కోసం ఈనెల 15న విశాఖపట్నంలోని విమ్స్‌లోనే వాక్ ఇన్ రిక్రూట్‌మెంట్ చేపట్టనున్నారు. అర్హులైన అభ్యర్థులు ఆయా తేదీల్లో నిర్ణీత ప్రదేశాలకు స్వయంగా హాజరు కావాల్సి ఉంటుంది. అర్హత, ఇతర నియమనిబంధనలతో కూడిన సమగ్ర నోటిఫికేషన్‌ను https://dme.ap.nic.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఒక్క పోస్టు కూడా ఖాళీగా ఉంచకుండా సీఎం జగన్ ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది.

జిల్లా వార్తలు


కేసీఆర్ త్వరగా కోలుకోవాలి

ఖమ్మంమయూరిసెంటర్: ప్రమాదవశాత్తు గాయపడిన బీఆర్‌ఎస్ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ త్వరగా కోలుకోవాలని ఎంపీలు నామ నాగేశ్వరరావు, వద్దిరాజు రవిచంద్ర ఆకాంక్షించారు. దేవుడి ఆశీస్సులతో కేసీఆర్ త్వరగా కోలుకుని ప్రజలకు సేవలందిస్తారనే నమ్మకం ఉందని తెలిపారు. అద్భుత పాలనతో కేసీఆర్ ప్రజల హృదయాల్లోనే నిలిచిపోయారని వారు వేర్వేరుగా విడుదల చేసిన ప్రకటనల్లో పేర్కొన్నారు. కాగా, కేసీఆర్ గాయపడినట్లు తెలియగానే ఎంపీ రవిచంద్ర గురువారం రాత్రి హైదరాబాద్‌లోని యశోదా ఆస్పత్రికి చేరుకుని ఆయనతో ఉన్నారు.

26 నుంచి 'నెహ్రూ కప్'

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలో ఏటా నిర్వహించే నెహ్రూ కప్ అంతర్రాష్ట్ర క్రికెట్ పోటీలను ఈ నెల 26 నుంచి జనవరి 7 వరకు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని నెహ్రూ కప్ వ్యవస్థాపకులు వాతాడి దుర్గా అశోక్, తోటమళ్ల బాలయోగి తెలిపారు. భద్రాచలంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. 1994 నుంచి టోర్నీ నిర్వహిస్తుండగా, రాష్ట్రవ్యాప్తంగా మంచి ఆదరణ లభిస్తోందని తెలిపారు. ఈసారి కూడా ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని, విజేతతో పాటు రన్నర్ జట్టుకు నగదు బహుమతులు అందజేస్తామని చెప్పారు. ఆసక్తి ఉన్న జట్ల బాధ్యులు ఈ నెల 15వ తేదీలోగా టోర్నీ కన్వీనర్ ఎస్కే సలీంకు వివరాలు అందజేయాలని సూచించారు. సమావేశంలో శ్రీధర్, శ్రీనివాస్, నాగార్జున, సదానందం, బాలమురళీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన గురుకులాల ఆర్‌సీఓగా వెంకటేశ్వరరాజు


పీఓకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఆర్‌సీఓ

భద్రాచలంటౌన్: భద్రాచలం ఐటీడీఏ పరిధిలోని ఉమ్మడి జిల్లా గిరిజన గురుకుల విద్యాలయాల రీజినల్ కోఆర్డినేటర్‌గా టి.వెంకటేశ్వర రాజును నియమిస్తూ గిరిజన గురుకుల సంస్థ కార్యదర్శి నవీన్ నికోలస్ ఉత్తర్వులు జారీ చేశారు. ములుగు జిల్లా ఏటూరునాగారం గిరిజన గురుకుల బాలుర జూనియర్ కళాశాలలో సీనియర్ ప్రిన్సిపాల్‌గా పని చేస్తున్న ఆయనకు ఆర్సీఓగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. శుక్రవారం విధుల్లో చేరిన వెంకటేశ్వరరాజు పీఓ ప్రతీక్ జైన్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ డేవిడ్ రాజ్, గురుకుల ప్రిన్సిపాల్ దేవదాసు, ఏఓ నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

భలే 'మంచు' రోజు.. తేగడ వద్ద తాలిపేరును కమ్మేసిన పొగమంచు


పొగ మంచు అందాలతో తేగడ లోలెవల్ వంతెన

ఒక్కసారిగా వాతావరణంలో మార్పు వచ్చింది. మిచాంగ్ తుపాన్ ప్రభావంతో మూడు రోజులపాటు ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. అయితే, శుక్రవారం వర్షం లేకున్నా.. చాలా చోట్ల మంచు ప్రభావం కనిపించింది. చర్ల మండల వ్యాప్తంగా తెల్లవారుజాము నుంచే చిరుజల్లుల మాదిరిగా మంచు కురిసింది. ఉదయం 8 గంటల తర్వాత కూడా మంచు ప్రభావం వీడకపోగా.. తేగడ గ్రామ సమీపాన తాలిపేరు నది వద్ద, వంతెనపై మంచు దుప్పటి పరుచుకోవడం చూపరులను ఆకట్టుకుంది. ఓవైపు నదీ ప్రవాహం, ఇంకోవైపు పచ్చని పంటలు, ఎత్తయిన గుట్టలు, మరోవైపు మంచు దుప్పటి కప్పుకున్న వంతెనను చూస్తూ స్థానికులు మైమరిచిపోయారు. - చర్ల రూరల్


మంచులో తేగడ వద్ద తాలిపేరు నది

విడిగానా.. కలిసేనా!?

- సింగరేణి ఎన్నికల్లో పొత్తులపై ఇంకా అస్పష్టత
- కోల్‌బెల్ట్ ఏరియాలో పది మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు
- రెండు చోట్ల బీఆర్ఎస్, సీపీఐకి ప్రాతినిధ్యం
- గత ఎన్నికల్లో తొమ్మిది చోట్ల టీబీజీకేఎస్ గెలుపు


గత ఎన్నికలలో ఓటు హక్కు వినియోగించుకుంటున్న కార్మికులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికలు ఈ నెల 27న జరగనున్నాయి. ఈ ఎన్నికలు నెల కిందటే జరగాల్సిన ఉన్నా అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం రకరకాల కారణాలతో వాయిదా వేస్తూ వచ్చిందనే ప్రచారం జరిగింది. ఇంతలోనే అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ రావడంతో డిసెంబర్ 27న ఎన్నికల నిర్వహణకు హైకోర్టు అనుమతించింది. అయితే, తాజాగా జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో సింగరేణి విస్తరించి ఉన్న 12 నియోజకవర్గాలకు గాను పది చోట్ల కాంగ్రెస్, ఒక్కో స్థానం బీఆర్‌ఎస్, సీపీఐ గెలుచుకున్నాయి. అయితే, అసెంబ్లీ ఎన్నికల్లో సీపీఐ, కాంగ్రెస్ కలిసి పనిచేశాయి. ఇదేతరహాలో సింగరేణి ఎన్నికల్లో కలిసే ముందుకు సాగుతారా, లేదా అన్నది స్పష్టత రావడం లేదు. కాగా, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాగా, గత గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఆ పార్టీ అనుబంధ సంఘం ఒక్క ఏరియాలోనూ గెలవలేదు. కానీ, సీపీఐ అనుబంధ సంఘమైన ఏఐటీయూసీ భూపాలపల్లి, మందమర్రి ఏరియాలో ప్రాతినిధ్యం దక్కించుకుంది. దీంతో కాంగ్రెస్ ఈసారి గుర్తింపు సంఘం ఎన్నికల్లో సీపీఐతో జత కలుస్తుందా అనేది త్వరలో తేలనుంది.

గత ఎన్నికల్లో టీబీజీకేఎస్ హవా

సింగరేణిలో 1998 నుంచి గుర్తింపు సంఘం ఎన్నికలు జరుగుతున్నాయి. మూడు సార్లు ఏఐటీయూసీ, ఒక్కసారి ఐఎన్‌టీయూసీ, రెండు సార్లు టీబీజీకేఎస్ ప్రాతినిధ్యం దక్కించుకున్నాయి. అయితే, 2017 ఎన్నికల్లో ఆ యూనియన్ అనుబంధ పార్టీ టీఆర్‌ఎస్ అధికారంలో ఉండటంతో ఆ పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలకు బాధ్యతలు అప్పగించి ప్రచారం చేయించారు. ప్రస్తుతం సింగరేణిలో ఏడోసారి గుర్తింపు సంఘం ఎన్నికలు జరగనుండగా అధికారంలో కాంగ్రెస్ ఉన్న నేపథ్యాన ఫలితం ఎలా వస్తుందోననే ఆసక్తి నెలకొంది. కాగా, గతంలో ఐఎన్‌టీయూసీలో కొనసాగిన పలువురు టీబీకేఎస్‌లో చేరగా యూనియన్‌కు కేడర్ లేకుండా పోయింది. కానీ, కార్మికుల సమస్యలపై పోరాడుతూ ఉనికి చాటుకుంటున్నారు. ఈ నేపథ్యాన కాంగ్రెస్, సీపీఐతో అసెంబ్లీ ఎన్నికల మాదిరిగా గుర్తింపు సంఘం ఎన్నికల్లో పొత్తు పెట్టుకుందా, లేదా అనేది తేలాల్సి ఉంది. సింగరేణి వ్యాప్తంగా 11 ఏరియాల్లో పనిచేస్తున్న 39,998 మంది కార్మికులు ఓటుహక్కు వినియోగించుకున్నారు. ఇక గత ఎన్నికల్లో 25 కార్మిక సంఘాలు బరిలో ఉండగా, ఈసారి 13 సంఘాలు మాత్రమే ఉన్నాయి.

ఈ ఎన్నికల్లో పోటీ చేసే సంఘాలు, గుర్తులు

- గోదావరి లోయ బొగ్గుగని కార్మిక సంఘం (చక్రంలో సుత్తి)
- ప్రజా తెలంగాణ సింగరేణి కార్మిక సంఘం (రెండు ఆకులు)
- సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘం (కాగడా)
- సింగరేణి కోల్ మైన్స్ లేబర్ యూనియన్ (టేబుల్ క్లాక్)
- సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (రిజిస్టర్ నం. ఈ 171 – ఉదయించే సూర్యుడు)
- సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (రిజిస్టర్ నం. ఈ 468 – మోటారు సైకిల్)
- సింగరేణి గని కార్మిక సంఘం (నెమలి)
- సింగరేణి మైనర్స్ అండ్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ (తరాజు)
- శ్రామికశక్తి గోదావరి లోయ బొగ్గు గని కార్మిక సంఘం (సింహం)
- తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం (బాణం)
- తెలంగాణ గోదావరి లోయ బొగ్గుగని కార్మిక సంఘం (స్పానర్)
- ది సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (నక్షత్రం)
- ది తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘం (హెల్మెట్ లైట్)

బోధనలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

భద్రాచలం ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్


వేదగణితం తరగతులను పరిశీలిస్తున్న పీఓ ప్రతీక్‌జైన్

బూర్గంపాడు: విద్యాబోధనలో ఉపాధ్యాయులు ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా చర్యలు తప్పవని భద్రాచలం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి ప్రతీక్‌జైన్ హెచ్చరించారు. బూర్గంపాడు మండలంలోని ఉప్పుసాక గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆశ్రమ పాఠశాలల్లో అమలవుతున్న వేద గణితం తరగతులను పరిశీలించిన పీఓ.. విద్యార్థులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. కాగా, పీఓ తనిఖీకి వెళ్లిన సమయంలో తరగతులు బోధించకుండా స్టాఫ్‌రూంలో ఉన్న ఇద్దరు గణిత ఉపాధ్యాయులను మందలించారు. సిలబస్ పూర్తి చేయకుండా నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని చెప్పారు. పదో తరగతిలో నూరు శాతం ఉత్తీర్ణత నమోదయ్యేలా ఇప్పటి నుంచే ప్రణాళికాయుతంగా బోధించాలని సూచించారు. కార్యక్రమంలో ట్రైబల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ మణెమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వ్యవసాయమే భవిష్యత్ తరాలకు దిక్సూచి..

వ్యవసాయ కళాశాల డీన్ డాక్టర్ హేమంత్‌కుమార్


ఎగ్జిబిట్లు ప్రదర్శించిన విద్యార్థులతో మాట్లాడుతున్న ఏడీ హేమంత్‌కుమార్


ఎగ్జిబిట్ల వివరాలు తెలుసుకుంటున్న విద్యార్థులు

అశ్వారావుపేటరూరల్: వ్యవసాయమే భవిష్యత్ తరాలకు దిక్సూచిగా నిలుస్తుందని.. వ్యవసాయాన్ని సైతం ఉపాధిగా ఎంచుకోవాలని అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల ఏడీ డాక్టర్ హేమంత్ కుమార్ అన్నారు. ఈ నెల 3న డాక్టర్ రాజేంద్రప్రసాద్ జయంతి సందర్భంగా నిర్వహించాల్సిన విద్యా దినోత్సవాన్ని మిచాంగ్ తుపాన్ కారణంగా వాయిదా వేశారు. ఈ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించగా అశ్వారావుపేటలోని పలు ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలకు చెందిన విద్యార్థులు వ్యవసాయ కళాశాలకు వచ్చారు. ఈ సందర్భంగా వ్యవసాయ విద్యార్థులు ప్రదర్శించిన ఎగ్జిబిట్లను పరిశీలించగా అవగాహన కల్పించారు. అనంతరం కళాశాలలోని నర్సరీ, పాలీ హౌజ్, వర్మీ కంపోస్టు యూనిట్, వాతావరణ కేంద్రం, కొబ్బరి తోటలు, ప్రయోగశాలలు సందర్శించారు. ఈ సందర్భంగా డీన్ మాట్లాడుతూ భవిష్యత్‌లో వ్యవసాయ రంగానికే అధిక ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. వ్యవసాయ విద్యతో మంచి ఉపాధి అవకాశాలు దక్కుతాయని చెప్పారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు, బోధనేతర సిబ్బంది, పాఠశాలల టీచర్లు పాల్గొన్నారు.